క్లుప్తంగా

13న సామాజిక తనిఖీ సభ

చాపాడు : స్థానిక స్త్రీ శక్తి భవనం వద్ద ఈ నెల 13న సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ చాపాడు మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 1 నుంచి 12వ తేదీ వరకూ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో 13న ఉదయం 10 గంటలకు సామాజిక బహిరంగ సభ నిర్వహించటం జరుగుతుందని, ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఏపీఓ కోరారు.

కఠినంగా శిక్షించాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహ శిలాఫలకాని పగులకొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం వైస్ ఎంపీపీ సీఎం బాషా, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలసి ఆయన స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారు టీడీపీకి చెందిన వారేనని ఆయన ఆరోపించారు. కూటమి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మహబూబ్‌పీరా, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, ఉపసర్పంచ్ రుద్రవరం ప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ నరసింహులు, దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి గాయత్రి

అట్లూరు : ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బద్వేలు న్యాయమూర్తి గాయత్రి తెలిపారు. శనివారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆమె ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ విద్యార్థులకు అందించే మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లగొండుగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాధురి, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ప్రత్యేక అధికారిణి పణిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : రెండో శనివారం సెలవు అయినా నారాయణ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సెలవు ఇవ్వలేదని, ఆ సంస్థపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రొద్దుటూరు, బద్వేలు, రైల్వేకోడూరు, రాయచోటి బ్రాంచ్‌లలో పనిచేసే ఉపాధ్యాయులకు కడప కేంద్రంగా వర్క్‌షాప్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వాలని ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు ఉన్నా వాటిని అమలు చేయని నారాయణ విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


నరసరాజు మృతి సంఘానికి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు బడభాగ్ని నరసరాజు మృతి సంఘానికి తీరనిలోటని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన నరసరాజు సంతాపసభలో ఆయన మాట్లాడుతూ స్నేహశీలి, ఉదారస్వభావం కలిగిన వ్యక్తి, అందరి ఆదరాభిమానాలు పొందిన నరసరాజు ఆకస్మిక మృతి సంఘ సభ్యులను కలచివేసిందన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు గంజికుంట పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.పిచ్చయ్య, కోశాధికారి గంగన్న, ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



మునెల్లి అయ్యవారయ్య

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన మునెల్లి అయ్యవారయ్యకు బెంగళూరు దయానంద సాగర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ప్రిడిక్టివ్ ఎనాలిటిక్స్ ఫర్ సార్–కోవ్–19 ఇన్సిడెన్స్ డిసీజ్ సెవెయరిటీ అండ్ పేషెంట్ మోరటాలిటీ యూసింగ్ మెషిన్ లెర్నింగ్' అనే అంశంపై దయానంద సాగర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ బొండు వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అయ్యవారయ్య చేసిన పరిశోధనకు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. అయ్యవారయ్య నంద్యాల రాజీవ్ గాంధీ మెమోరియల్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అధ్యాపకునిగా పనిచేస్తున్నారు.

వెనుకబడి

ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఇదే సమయంలో ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థుల చేరికలు పెరిగిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంత మందికీ ఒక్కొక్కరికి 15 వేలు తల్లి బ్యాంక్ ఖాతాలో జమ చేస్తామని ప్రకటించింది. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రైవేట్ స్కూళ్లల్లో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో క్రమంగా ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు తగ్గుతున్నాయి.

- ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థులు
- నాడు కళకళ.. నేడు వెలవెల
- ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గు

ప్రొద్దుటూరు కల్చరల్ : సర్కారు స్కూళ్లలో విద్యార్థుల సంక్షేమం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం, బూట్లు ఉచితంగా అందిస్తున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్య లభించడం లేదని భావించి.. ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నికల సమయంలో తెలుగుదేశం ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటైన తల్లికి వందనం పథకం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపిందని చెప్పవచ్చు. ఒక ఇంటిలో ఎంత మంది విద్యార్థులు ఉంటే.. అంత మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల వంతున తల్లి అకౌంట్‌లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వం అందించే డబ్బులు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులుగా చెల్లించవచ్చునని, విద్యా అవసరాలకు వాడుకోవచ్చని తల్లిదండ్రులు భావించారు. దీంతో గత ఏడాదితో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గింది.

తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య

ప్రొద్దుటూరు మండలంలో 112 ప్రభుత్వ మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 82 ప్రాథమిక, 9 ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలల్లో 15,020 మంది విద్యార్థులు చదవగా, ఈ విద్యాసంవత్సరంలో 14,365 మంది ఉన్నారు. 655 మంది విద్యార్థుల సంఖ్య తగ్గింది. విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ అయితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. బడి బయట పిల్లలను, పనులకు వెళుతున్న పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– సావిత్రమ్మ, మండల విద్యాశాఖాధికారి, ప్రొద్దుటూరు

క్రీడా నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యామందిరంలో శనివారం శ్రీ సరస్వతీ విద్యాపీఠం అనంతపురం సమితి స్థాయి ఖేల్‌కూద్ పోటీలు క్రీడాకారుల మధ్య ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం క్రీడాసాధన చేసి క్రీడా నైపుణ్యం సంపాదించుకోవాలన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో రాణించిన వారికి విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్ సౌకర్యం ఉందని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, వైవీఎస్ మున్సిపల్ గర్ల్స్‌హైస్కూల్, ఆర్‌సీపీఈ కళాశాలలో క్రీడాకారులకు కబడ్డీ, ఖోఖో వాలీబాల్, లాంగ్‌జంప్, హైజంప్, 100 మీ, 200 మీ, 400 మీ, 800 మీటర్ల పరుగు పోటీ తదితర విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఖేల్‌కూద్ పోటీల్లో రాయలసీమ జోన్‌లోని 42 విద్యామందిరాలకు చెందిన 3వ తరగతి నుంచి 10 తరగతి చదివే 795 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలు ఆదివారంతో ముగియనున్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనపచిన క్రీడాకారులు త్వరలో నరసరావుపేటలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులకు నిర్వాహకులు భోజన, వసతి కల్పించారు. కార్యక్రమంలో కడప విభాగ్ సరస్వతీ విద్యాపీఠం అధ్యక్షుడు డాక్టర్ సోమ లక్ష్మీ నరసయ్య, అనంతపురం సమితి సరస్వతీ విద్యాపీఠం కార్యదర్శి పరుచూరు రమేష్, వ్యాపారవేత్త రామచంద్రారెడ్డి, పాఠశాల నిర్వహణ కమిటీ ప్రతినిధులు యల్లారెడ్డి, రామచంద్రయ్య, కేశవరెడ్డి, డాక్టర్ నాగదస్తగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవిత్ర పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం



నూతన ఫాతిమామాత దేవాలయ శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న కడప మేత్రాసన పీఠాధిపతి గాలిబాలి

బద్వేలు అర్బన్ : బద్వేలులోని పునీత ఫాతిమామాత పవిత్ర దేవాలయాన్ని అందరి సహకారంతో పవిత్ర పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతామని కడప మేత్రాసన పీఠాధిపతి మహాఘన గాలిబాలి తెలిపారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని ఫాతిమామాత దేవాలయంలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయ శిలాఫలకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో మొదటి విచారణగా ఏర్పాటైన ఫాతిమామాత దేవాలయానికి నూతన భవనం నిర్మించడం శుభపరిణామమన్నారు. అన్నిరకాల వసతులతో దేవాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. అనంతరం కడప డయాసిస్ సాంఘిక సేవాసంస్థ డైరెక్టర్ ఫాదర్ బాలరాజు ఆధ్వర్యంలో మహిళా సాధికారత కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిననాడు సమాజంలో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కో ఆర్డినేటర్ తలారి రవీంద్రనాథ్‌జోష్, ఆయా చర్చిల విచారణ గురువులు, సహాయ గురువులు, సిస్టర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

మదనపల్లె : బెంగళూరు వైదేహి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చి సెంటర్, పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్ స్వాస్థ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష శిబిరానికి విశేష స్పందన లభించింది. వైదేహి హాస్పిటల్ హెడ్ ఆఫ్ కార్డియాక్ సైన్సెస్, సీనియర్ హార్ట్ సర్జన్ డాక్టర్.దుర్గాప్రసాద్‌రెడ్డి, వైద్యులు శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించారు. ఈసీజీ, 2డి–ఎకో స్కాన్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా స్వాస్థ హాస్పిటల్ డైరెక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముంతాజ్‌అలీ (శ్రీఎం) ఆధ్వర్యంలో నడుపుతున్న స్వాస్థ ఆస్పత్రి చారిటీ హాస్పిటల్ అని అన్నారు. పట్టణ ప్రజలు స్వాస్థ ఆస్పత్రి సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహమ్మద్ ఫాజిల్ అక్బరీ, మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్ ఆజం, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, ఆర్ఎంఓ ఉమేష్, డాక్టర్.కృష్ణతేజ, పవన్ పాల్గొన్నారు.



ఉచిత గుండె పరీక్ష శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

వెల్లాలలో శ్రావణ సందడి

రాజుపాళెం : శ్రావణ మాసంలో మొదటి శనివారం కావడంతో మండలంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలో భక్తుల సందడి నెలకొంది. శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వాములకు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు స్వాములను దర్శించుకొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాములను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందోహం మధ్య స్వాములను వైభవంగా భక్తులు ఊరేగించారు. ఆలయాలకు వచ్చిన భక్తులకు సంజీవరాయ అన్నదాన సత్రం, ఆర్యవైశ్య అన్నసత్రంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈఓ నరసయ్య, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, రామమోహన్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ రామసుబ్బారెడ్డి, సుబ్బిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.



స్వాములను దర్శించుకునేందుకు క్యూలో ఉన్న భక్తులు (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో సంజీవరాయ స్వామి

25 నుంచి జిల్లా ఆస్పత్రిలో శానిటేషన్ సిబ్బంది సమ్మె



ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆనంద్‌బాబుకు సమ్మె నోటీసు ఇస్తున్న యూనియన్ నాయకులు

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ఈనెల 25 నుంచి సమ్మె చేపడుతున్నట్లు ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ శానిటేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజమ్మ, ప్రమీల తెలిపారు. ఈ మేరకు వారు శనివారం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైతన్య జ్యోతి సొసైటీ వారు గత ఏడాది కాలంగా సరైన సమయంలో నెలనెలా 5వ తేదీ లోపల వేతనాలు అందివ్వడం లేదన్నారు. నాలుగు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉందన్నారు. పీఎఫ్ఈఎస్ఐ చెల్లింపులను చేయకుండా ప్రభుత్వాన్ని ఇటు కార్మికులను మోసం చేస్తున్నారని తెలిపారు. పలుమార్లు మెడికల్ సూపరింటెండెంట్, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డికి విన్నవించినా ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. తిరిగి చైతన్య జ్యోతి సొసైటీ వారికే కాంట్రాక్టును ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఈ క్రమంలో సమ్మె తప్ప మరో మార్గం కనపడకపోవడంతో క్లాజ్ 6(1) ప్రకారం నోటీసు అందిస్తున్నామన్నారు. ఈనెల 12 నుంచి దశల వారి కార్యక్రమాలు చేపట్టి 25 నుంచి నిరవధిక సమ్మె చేస్తామన్నారు. చైతన్య సొసైటీపై చర్యలు తీసుకుని పెండింగ్ వేతనాలు అందించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ యూనియన్ పట్టణ నాయకులు చెన్నమ్మ, విమల, ప్రభావతి, ఏఐటీయూసీ పట్టణ నాయకులు మధు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నరసింహారావుకు సన్మానం



నరసింహారావుకు నగదును అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

కాశినాయన : మండలంలోని నాయునిపల్లె గ్రామానికి చెందిన తలారి నరసింహారావు అంతర్జాతీయ సింగిల్స్ వాల్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబానికి చెందిన నరసింహారావు ఈనెల 25న నేపాల్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపిక కావడంతో శనివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో ఎస్టీయూ నాయకులు నరసింహారావు, వారి తండ్రి నరసింహులును సత్కరించారు. ఉపాధ్యాయులు నటరాజ్, రాజారెడ్డిలు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. మారుమూల ప్రాంతానికి చెందిన నరసింహారావు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి దేశానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ సుబ్రమణ్యం, ఎస్టీయూ నాయకులు, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై 307 కేసు నమోదు చేయాలి



దాడికి గురైన మహిళలను పరామర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

బద్వేలు అర్బన్ : మండలంలోని సి.కొత్తపల్లె పొలంలోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న దళిత మహిళలపై దాడి చేసిన టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత ఫోరం జిల్లా చైర్మన్ కిషోర్, సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి బి.నారాయణ, బీఎస్పీ రాష్ట్ర నాయకులు ఎస్.గురప్పలు డిమాండ్ చేశారు. ఇటీవల టీడీపీ నేతల దాడిలో గాయపడిన మహిళలను శనివారం వారు పరామర్శించడంతో పాటు గుడిసెలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సర్వే నెంబర్ 54లో టీడీపీ నేత రామచంద్రారెడ్డి పేరుపైన సెంటు స్థలం లేకపోయినప్పటికీ ఆయన రౌడీమూకలను వెంట తీసుకుని వెళ్లి దళిత మహిళలపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. అలాగే ప్రభుత్వ భూములను కాపాడటంలో రెవెన్యూ అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. తక్షణమే అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఆర్.వి.ప్రసాద్, జర్నలిస్టు అసోసియేషన్ నాయకులు ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కొండగోపాలస్వామి ఆలయంలో భక్తుల సందడి





స్వామి దర్శనానికి భారులు తీరిన భక్తులు, పూజలందుకుంటున్న కొండగోపాలస్వామి మూలవిరాట్

అట్లూరు : శ్రీకొండగోపాలస్వామి ఆలయం శనివారం భక్తులతో భారులు తీరింది. ప్రతి ఏటా శ్రావణమాస శనివారాలలో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. శ్రావణమాస మొదటి వారమైన శనివారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. అయితే వేకువ జామునుంచే ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌ను అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు స్నానపు గుండంలో స్నానమాచరించి స్వామి దర్శనానికి భారులు తీరారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

రాజీలేని పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

బద్వేలు అర్బన్ : రాజీలేని సమరశీల పోరాటాలు యూటీఎఫ్‌కే సాధ్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ తెలిపారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద యూటీఎఫ్ పతాకాన్ని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్.ఓబుల్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. యూటీఎఫ్ ఏర్పడిన ఆవిర్భావం నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శివప్రసాద్, ఆయా మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవానందం, సుధాకర్, క్రిస్టఫర్, కృష్ణుడు, అట్లూరు మండల అధ్యక్షుడు కంచిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త రంగుల్లో సుజుకి ద్విచక్రవాహనాలు




సుజుకి వాహనాలతో ఎండీ సయ్యద్ మహమ్మద్ సోహైల్

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని రెహాన్ సుజుకి షోరూంలో సుజుకి కంపెనీకి చెందిన ద్విచక్రవాహనాలు సరికొత్త రంగుల్లో వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చినట్లు రెహాన్ సుజుకీ మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ మహమ్మద్ సోహైల్ తెలిపారు. రెహాన్ సుజుకి షోరూంలో వినియోగదారులు జాఫర్, సలీంలు సుజుకి యాక్సెస్, సుజుకి అవెన్స్ మొదటి ద్విచక్రవాహనాలను కొనుగోలు చేశారు. యువతకు నచ్చే విధంగా వాహనాల రంగులు ఉన్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో షోరూం సీఈఓ అబ్దుల్, సేల్స్ జీఎం చాంద్, సర్వీస్ మేనేజర్ యాసిన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు : స్థానిక జార్జికారొనేషన్ క్లబ్‌లో ఆదివారం ఉదయం 9.30 గంటలకు చిత్ర సాహితీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో చిత్రకవితా సౌరభం రెండవ భాగం అలంకార చిత్రం పుస్తకావిష్కరణ, పరిచయ కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు అలంకారం విజయకుమార్, అలంకారం శ్రీఆదిత్య కుమార్, అలంకారం వసంతకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హంస అవార్డు గ్రహీత, ప్రముఖ అవధాని డాక్టర్ నరాల రామారెడ్డి సభకు అధ్యక్షత వహిస్తారని, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లు, విద్వాన్ చలంకోట బురుజు మునస్వామి, పుల్లూరు మాతయ్య పుస్తకావిష్కరణ చేస్తారని వారు వివరించారు. కడప సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పుస్తకాన్ని పరిచయం చేస్తారని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారగ్రహీత డీకే చదువులబాబు, ప్రముఖ హిందీ అనువాదకులు డాక్టర్ కొమ్మిశెట్టి మోహన్, కథారచయిత ఎస్.దాదాహయాత్, యువసాహితీవేత్త డాక్టర్ జీవీ సాయి ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లెలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయస్వామి మూలవిరాట్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస తొలి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. కాయాకర్పూరాలను సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

రామసముద్రం : 78వ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి, స్వాతంత్ర్య సమరయోధులకు పుష్పాంజలి ఘటించాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం రామసముద్రంలో బీజేపీ మండల స్థాయి కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా రామసముద్రం ఎగువపాళ్యంకు చెందిన కృష్ణప్పను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఆనంద్ కుమార్ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, మండల కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.